# నివురు గప్పిన నిప్పు

రచన:
"శ్రీ మాలిన్"

హౌరా - కలకత్తాలమధ్య రాకపోకలకు హౌరాబ్రిడ్జి యెంత ప్రాముఖ్యత వహిస్తోందో విజయవాడ ఓల్డు, న్యూ టౌన్సును కలుపుతూన్న స్టేషను బ్రిడ్జి అంత ప్రాముఖ్యత సంపాయించింది. సర్వకాల సర్వావస్థలయందు జనం బిలబిలమంటూ జలప్రవాహం మల్లే నడుస్తుంటారు ఆ బ్రిడ్జిమీద. అప్పుడే యేదో ట్రైను ప్లాటుఫారంమీద ఆగినట్లుంది. అందుచేత బ్రిడ్జంతా మరీ క్రౌడుగావుంది. ముసలాళ్ల అరుపులతో పిల్లలయేడుపులతో ఆడాళ్ల అలకలతో మగవాళ్ల చిరాకులతో వంతెనంతా ఒకే గొల్లుగా వుంది. సులోచనదారి చక్రవర్తి ఆలోచన రహితుడై వచ్చేపోయే వయసుపిల్లలకు చిన్నడేష్‌కొడుతూ పడమర చివరనుండి తూర్పు చివరకు చరచరా నడచిపోతున్నాడు.

వంతెన చివర యెవరో వన్నెల చిన్నది సన్నని నడుంపై చేయివేసుకొని హేండ్‌బేగ్ వూపుకొంటూ సాలోచనగా నుంచొనివుంది వంటరిగా. తలపై అడ్డముగా కట్టిన పచ్చని రుమాలు, యెఱ్ఱని రవికపై సన్నని జార్జెట్ వైట్‌శారీ, నల్లని నాణ్యమైన చెప్పులు ఆ నవనాగరిక బంగారుబొమ్మకు మెరుగులు దిద్దుతున్నట్లున్నాయి. వచ్చేపోయేవాళ్ల కళ్లు అసంకల్పితంగా అటే పడుతున్నాయి. చరచరపోయే చక్రవర్తి దొరికిన చాన్సు లూజ్‌చేసుకోవటం వట్టి ఫూలిష్ తింగ్ అని ధైర్యంతెచ్చుకొని వన్నెలాడికి చిన్న డేష్ కొట్టి నాలుగడుగులు ముందుకు సాగిపోయాడు. "మిష్టర్" అన్న పిలుపుతో వక్రతోవపట్టిన చక్రవర్తిగారి చక్రాలకు సక్రమంగా బ్రేకులు పడ్డాయి. గుండెదడ మామూలుస్థాయిని కొంచెం మించిపోయింది.

"సారీ" అంటూ దీనంగా చూసాడు చక్రవర్తి.

"దానికేమి లేండి ... ఇలా కొంచం వస్తారా?"

మెల్లగా పిలిచి చల్లగా చెప్పుతో చప్ప చప్పగావడ్డిస్తుందేమోనని భయపడ్డాడు. అందరూ తనవేపే చూస్తున్నారు. ఆడదానికి భయపడి పారిపోవటం ఇన్సల్టుగా భావించి జంకుతూ వెళ్లేడు.

"మీ దీ వూరేనా?" అంటూ వయ్యారం వలకబోసింది వన్నెల విసనకర్ర.

"అవును! ఈ వూరే" ముఖంవేపు తేరిచూశాడు. కేకు దట్టంగా పూసిన ముఖం ముత్యాలు కురిపిస్తోంది. విద్యుద్దీపాలవెలుగులో ఆ తళతళకు చక్రవర్తికళ్ళు మిలమిలమన్నాయి.

"గవర్నరుపేటకు యెటు వెళ్లాలి?" అన్నమాటలు విన్న చక్రవర్తికి 'ఇదేదో అనుకొని అదృష్టంమల్లే వుంది' అనిపించింది.

"ఇటే వెళ్లాలి" అంటూ ప్రక్కకు చేయి చూపించాడు.

"మీరు ఎంతవరకు వెళ్తున్నారు?"

"నేనూ గవర్నర్‌పేటే వెళ్తున్నాను" అన్నాడు.

"బ్రతికించారు! పదండి... ఈ వూరు నాకు క్రొత్త అంతా రౌడీ వెదవల్లా వున్నారు" అంటూ వెంటపడింది.

ఇద్దరూ కలసి వంతెనదిగారు. రిక్షావాళ్ళు 'బాబూ రిక్షా ... అమ్మ రిక్షా' అంటూ ఎదురుగా వచ్చారు. 'గవర్నర్‌పేట సెంటర్‌కు యెంత తీసుకొంటావ్' అన్నాడు చక్రవర్తి వకని నుద్దేశించి.

"పావలా పాటేకదా బాబూ కొత్తగా అడగాతా?"

"రెండు రిక్షాలు తీసుకురండి" అన్నాడు.

"అబ్బే యిద్దరికి రెండెందుకూ" అంది సుందరాంగి.

"అది కాదండీ..." అంటూ నసిగాడు చక్రవర్తి.

"మరేం పరవాలేదులెండి" అంటూ చిరునవ్వు చిందించింది.

ఇద్దరూ కలసి రిక్షాయెక్కారు. చక్రవర్తి గుండె ద్రవీభవించి కృష్ణానది ప్రవాహం మల్లే ప్రవహిస్తోంది. ఒక అపరిచిత నాగరిక నవయవ్వనయువతి చెంత కూచున్న ప్రతి వయసువానికీ అలాగే ప్రవహిస్తుందేమో రక్తం హృది గుండె.

"మీ రిక్కడేం చేస్తున్నారు?" వినసొంపైన కంఠం.

"R M S లో పని చేస్తున్నా..." అంది కరకుదేరిన కంఠం.

"కుటుంబంతోనే వుంటున్నారా?"

"ఇంకా మేరేజీ కాలేదు"

"I See ! ... అలా చెప్పండి అందుకే అంత చురుకుగా..." అంటూ అర్ధోక్తిలో ఆపేసింది చిలిపిగా నవ్వుతూ. చక్రవర్తికి ఎలా మాటలు కలపాలో పాలుపోలేదు. రిక్షాకుదుపులో ఏరి కోరి శరీరాన్ని చేరవేస్తూ 'పూర్వజన్మఫలమేమో ఇదంతా' అనుకుంటున్నాడు మనసులో.

"ఈవూరు రేడియో స్టేషన్‌లో ఇంజనీరుగా పనిచేస్తున్నారు మా మామయ్య. ఆయనపేరు వెంకటేశ్వరరావ్ ... గవర్నరుపేటలోనే వుంటున్నారు ... మీకేమైనా తెలుసా?"

"వెంకటేశ్వరరావుగారా" అన్నాడు.

"అవునండి..."

తెలియదే..." అన్నాడు సాగదీస్తు సాలోచనగా.

"గవర్నర్‌పేటలోనే వుంటున్నారట. నేను ఎడ్రసుకూడా తెచ్చుకోలేదు... మెడ్రాస్ వెళుతూ చూచి పోదామని దిగాను. ఈ రాత్రపుడు యెవర్నడిగితే యెవరు చెబుతారు ... కాకపోతే ఉదయము రేడియో స్టేషనుకు ఫోన్‌చేసి మా మామయ్యానే పిలుస్తాను...ఇక్కడెక్కడైనా మంచిలాడ్జీ చూపిద్దురూ.

"ఓ...అలాగే అజంతాలాడ్జింగ్‌లో రూమ్‌తీసుకొండి సౌఖ్యంగావుంటుంది"

"తీసుకొండి అంటే కాదు. అంతా మీరే దగ్గరుండి యేర్పాటుచేయాలి. నా కంతా కొత్త...మీ మేలు మరచిపోను" అన్నది ప్రార్థనపూర్వకంగా.

అంతలో రిక్షా గలగలమని శబ్దం చేస్తూ సెంటర్‌లో ఆగింది. చక్రవర్తి రిక్షాదిగి జేబులోనుంచిపర్స్‌తీసి పావులా రిక్షావాడికిచ్చాడు.

"నేయిస్తాలెండి" అన్నది సన్నకంఠం సంచితీయబోతూ.

"మరేం పరవాలేదులెండి" అన్నాడు జేబులో పర్సుపెడుతూ.

అజంతా హోటలుకు వెళ్లారు. పది రూపాయలు అడ్వాన్సు కట్టమన్నాడు హోటల్ ప్రొప్రయిటర్.

"హండ్రెడ్ రుపీస్ చేంజి వుందా?" అన్నది మృదుమధురంగా.

"అంత వరకూ లేదు" అన్నాడు హోటల్ వాడు.

"అయితే యెలా?" అంటూ ప్రశ్నార్థకంగా చూసింది చక్రవర్తివేపు.

"ఇలాంటిదగ్గర వెను కంజ వేస్తే మర్యాదాగావుండదు. ఉదయం మార్చి అవిడే యిచ్చేస్తుంది. అందులోకీ ఇంజనీరుగారి మేనకోడలు" అనుకొంటూ 'నే యిస్తా! తరువాత చూసుకోవచ్చు' అంటూ యిచ్చాడు.

హోటల్‌కుర్రవాడు రూముచూపించాడు. ఇద్దరూ సావకాశంగా కూచున్నారు రూములో.

"ఇంతకూ మీపేరు చెప్పేరుకాదు"

"నా పేరు రాణి ... మీ పేరు అడగొచ్చునా?"

"చక్రవర్తి"

"సరిపోయింది"

అమాట వినగానే చక్రవర్తి వళ్లంతా కితకితలువేసింది.

"నే వెళతా ... ఉదయం కలుసుకొందాం."

"అదేంటి నన్ను యిక్కడ వంటరిగా వదిలేసి వెళతారా!"

"మరేం భయంలేదు. నేను ఉదయము వస్తా" అన్నాడు చక్రవర్తి వెళ్ళటం యిష్టం లేకపోయినా మాట వరసకు.

"మీకు పుణ్యం వుంటుంది. ఈ రాత్రికి యిక్కడే ఎలాగోలా కళ్లుమూసుకొండి. కే రి య ర్ కూ డా తెమ్మని చెప్పాను" అంది రాణి తలగుడ్డ గట్టిగా కట్టుకొంటూ.

ఇద్దరూ భోజనం చేశారు. భోజనం చేసేటప్పుడు కూడా రాణీ తలగుడ్డవిప్పలేదు. చక్రవర్తి నవ్వు అపుకోలేక నవ్వేశాడు.

"ఎ ం దు క లా నవ్వుతున్నారు" అంది రాణి.

"మీ తలగుడ్డ యెప్పుడూ తలనంటిపెట్టుకొనేవుండాలా" అని అన్నాడు.

"అబ్బే! చలిగా వుందండి! ఆ గుడ్డ లేకపోతే నిద్రకూడా పట్టదు" అంది రాణి జారిపోతున్న చీర సర్దుకొంటూ.

"మంచి అలవాటే!"

"బాగా చెప్పారు ... ఇంతకి మీ రీవూళ్ళో యెన్నాళ్ళుంటారు"

"ఐదురోజులుంటా. మళ్లీ మిమ్మల్ని మీట్ అవగలనో లేదో కొంచం మీ అడ్రస్ దీనిమీద వ్రాయండి" అంటూ బేగ్‌లోనుండొక తెల్లకాగితంతీసి నాలుగు మడతలుపెట్టి అందించింది. చక్రవర్తి రాణికి చేరువగా కూచొని అడ్రస్ క్లియర్‌గా వ్రాశాడు. ఆ కాగితాన్ని జాగ్రత్తగా బేగ్‌లోపెట్టి 'తేంక్సు' అంది.

"మీకు ఇవాళ చాలా శ్రమిచ్చాను"

"శ్రమేముంది-వేడిగా భోంచేశాను వెచ్చగా నిద్రపోతాను" అన్నాడు.

"వెచ్చగా నిద్రపోతారా?"

"అవును వెచ్చగా నిద్రపోతా"

"ఏదీ! ఎంత వెచ్చగా వున్నారో చూస్తా" అంటూ చొరవచేసి చక్రవర్తి గుండెమీద చేయివేసింది.

చక్రవర్తి రాణిచెయ్యిని ఆశతీరా హృదయానికి హత్తుకొన్నాడు. ఇంతలో ఎలక్ట్రిసిటీ ఫెయిల్యూర్‌వలన లైట్లన్నీ ఆరిపోయాయి. తర్వాత లైట్లు యెప్పుడు వెలిగాయో తెలియదు. చక్రవర్తి నిద్ర లేచేసరికి రవిరశ్మి గది గవాక్షంగుండా బెడ్డుమీద పడ్తోంది. రాణి అద్దంముందు నుంచొని తలకు రంగురాసుకుంటోంది. బహుశా అందుచేతే కామోసు రాత్రి తలగుడ్డతీయలేదు "ఛీ! ఛీ!!" అనుకున్నాడు మనసులో.

"లేచారా" అంది తలకు రంగు మత్తుగా పట్టిస్తు—

"ఏంటీ మోసం"

"మోసం కాదు బ్రతుకు తెరువు" అంటూ పక్లికిలించింది.

చక్రవర్తి వళ్ళు మండింది. గాబరాగా జేబు తడుముకొన్నాడు.

"జేబులో పర్సేది?"

"ఏమో నాకేంతెలుసు. నేను ఇంజనీరుగారి మేనకోడల్ని తెలుసా! మీపర్సు కోసం కక్కుర్తిపడేదాన్ని కాదు.

"నీ బ్రతుకు చట్టుబండలు కాను. ముందు నాపర్సు యిచ్చేయ్ లేకపోతే పోలీస్‌రిపోర్టుచేస్తాను."

"పోలీసురిపోర్టు మాటకేంగాని మన పెళ్లెపుడండీ?"

"ఓముసలిముండ మనపెళ్లేంటే?"

"రాత్రి మీరు వ్రాసియిచ్చిన వాగ్దాన పత్రం నాదగ్గరే వుంది"

"వాగ్దానపత్రమా! నేనేమీ వ్రాయలేదు"

"రాత్రి మీరు వ్రాయలేదూ?"

"అడ్రస్ వ్రాసాను"

"అవును మీరు తెల్లకాగితం చివర మీపేరు కాదుకాదు సంతకంచేసి దాని క్రింద మిగతా అడ్రస్ వ్రాశారు. పత్రమంతా నే నింపుకొన్నాను"

"అందుకా కాగితం నాలుగు మడతలుపెట్టి నాజూగ్గా అందించావు. నీకు నమస్కారం చేస్తాను నన్ను రచ్చకీడ్చకు."

"మాటాడకుండా బయట కెళ్లండి" చక్రవర్తి పిల్లిలా చల్లగా బయట్తోరాడు.

"మిష్టర్ అంటూ పిలచి, వంతెన మీద వంటరిగా కనుపించే అడవాళ్లను మరెప్పుడూ తాకకండి!"

చక్రవర్తివళ్లు చురచురా మండింది కాని తన పిలక అమెచేతిలో చిక్కడం చేత మారుమాటాడకుండా పిల్లిలా వెళ్లిపోయాడు. ★